నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

భక్తితోడ నరులు భగవానుని నమ్మ
దీవెనలనునిచ్చు భవ్యముగను
ధరణి జనుల నమ్మ ధైర్యముండ వలెను
పిరికితనముగున్న విలువలేదు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 41 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 19-06 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ టాప్..!




- షాకింగ్ నిజాలు వెల్లడించిన కేంద్ర నివేదిక
- జాతీయ సగటు కంటే భారీగా పెరిగిన ప్రమాదాలు
- ఏడాది కాలంలోనే 13.5 శాతం పెరుగుదల
- రహదారులపై నెత్తురు.. గతేడాది 7,900 మంది మృతి
- మృత్యుపాశంగా మారుతున్న 'అతివేగం'
- హిట్ అండ్ రన్, డీకొట్టడాలే ప్రధాన కారణాలు
- ప్రమాదాల కట్టడికి రవాణా శాఖ సరికొత్త చర్యలు

2

# అమెరికాపై విజయం సాధించాం



- ప్రకటించిన ఇరాన్
- ఫ్రాన్స్‌లో ట్రంప్-పెజెష్కియాన్ ఒప్పందం
- ట్రంప్ సంతకమే అమెరికా లొంగుబాటుకు సాక్ష్యం
- హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌దే సర్వాధికారం
- ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే ఉల్లంఘనే!
- తుది నిర్ణయానికి 60 రోజుల గడువు

2

# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

## పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది

- ఢిల్లీ తరహా కాలుష్య ముప్పు రాకూడదనే హరితహారానికి పెద్దపీట
- ఎవరు అడ్డుపడినా మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవం జరిగి తీరుతుంది
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్కులో వనమహోత్సవం.. నాగలింగం మొక్క నాటిన సీఎం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం

-మిగతా 2 లో





## గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటును వేగవంతం చేయండి

- జులై 3 నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఉండాల్సిందే
- సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చండి
- అటవీ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి:** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. జులై 3వ తేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియమావళు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, ఎలాంటి జాప్యము చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి.

-మిగతా 2 లో



## మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ

- ప్రతిపక్ష నేతగా రితబ్రతనే కొనసాగిస్తూ కోర్టు నిర్ణయం
- అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు
- పార్టీపై తిరుగుబాటు చేసిన 64 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు
- స్పీకర్ రతీంద్ర బోస్ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమన్న జస్టిస్ కృష్ణా రావు
- మమత పిటిషన్‌పై స్పీకర్, ప్రతివాదులకు కోర్టు నోటీసులు
- అఫిడవిట్ దాఖలుకు ప్రతివాదులకు రెండు వారాల గడువు
- జూలై 28కి తదుపరి విచారణ వాయిదా

**న్యూఢిల్లీ** టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టీఎంసీ రెబల్ నేత రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. ఇప్పటికిప్పుడు ఈ విషయంలో ఎలాంటి మార్పునకు ఆదేశించలేమని కోర్టు తెలిపింది. ఈ మేరకు కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ క్రిష్ణా రావ్ ఈ కేసుపై నిర్ణయం తీసుకున్నారు. టీఎంసీకి చెందిన ఎమ్మెల్యేలు చాలా మంది మమతకు, పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన సంగతి తెలిసిందే.64 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి, తమ పార్టీ తరఫున రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని బెంగాల్ స్పీకర్ రతింద్ర బోస్‌ను కోరారు. 90 మంది ఎమ్మెల్యేల్లో 64

-మిగతా 2 లో



## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్..!

- నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్
- కేంద్ర ప్రభుత్వం సంచలన ఆరోపణలు.. ఢిల్లీ హైకోర్టుకు నివేదిక
- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు
- ప్రైవసీ ఫీచర్ల చాటున దగుల్బాజీ ముఠాల గుట్టు
- డ్రగ్స్ అక్రమ రవాణా, ఉగ్రవాద ప్రచారానికి వేదికగా గ్రూపులు
- చైల్డ్ పోర్నోగ్రఫీ, డేటా చోరీపై కేంద్రం తీవ్ర ఆందోళన

**న్యూఢిల్లీ,** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దిల్లీ హైకోర్టును

-మిగతా 2 లో

## బంగాళాఖాతంలోకి పాకిస్థాన్ సబ్‌మెరైన్..!



- చైనా సాయంతో 'హ్యాంగర్ క్లాస్' జలంతర్గామి కొనుగోలు
- హిందూ మహాసముద్రంలో పరిధిని విస్తరిస్తున్న పాక్
- 1971 యుద్ధం తర్వాత మళ్లీ బంగాళాఖాతంలోకి..
- శత్రు రాడార్లకు చిక్కకుండా నీటిలోనే ఉండే అత్యాధునిక సాంకేతికత
- విశాఖ తూర్పు నౌకాదళ స్థావరానికి కొత్త సవాల్
- చైనా-పాక్ వ్యూహాలకు దీటుగా బదులిచ్చేందుకు భారత్ సన్నద్ధం

**న్యూఢిల్లీ** భారతదేశానికి అత్యంత కీలకమైన బంగాళాఖాతం లో వ్యూహాత్మక ఉనికిని చాటుకోవడానికి పాకిస్థాన్ నౌకాదళం సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. చైనా సాయంతో తమ నౌకాదళంలోకి కొత్తగా చేర్చుకున్న అత్యాధునిక హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాముల ను ఈ ప్రాంతంలో మోహరించాలని పాకిస్థాన్ భావిస్తున్నది.

-మిగతా 2 లో

# వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం


## 30న రైతు భరోసా నిధులు విడుదల

- మధిర వేదికగా సీఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్ జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ

-మిగతా 2 లో





## యూఏఈలో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..!

- ఈ ఘనత సాధించిన తొలి అరబ్ దేశంగా రికార్డు
- సొంత అకౌంట్లు, కొన్ని ప్రత్యేక ఫీచర్లపై పూర్తి ఆంక్షలు
- చిన్నారుల డిజిటల్ భద్రతే లక్ష్యమన్న యూఏఈ ప్రభుత్వం
- నిబంధనల మార్పు కోసం సోషల్ మీడియా సంస్థలకు ఏడాది గడువు
- రోజుకు సగటున 3 గంటలు సోషల్ మీడియాలోనే.. సర్వేలో విస్తుపోయే నిజాలు
- ఆస్ట్రేలియా, యూకే బాటలోనే పయనిస్తున్న యూఏఈ
- దశల వారీగా కొత్త నిబంధనల అమలుకు ప్రణాళికలు

**న్యూఢిల్లీ,** సామాజిక మాధ్యమాలు పిల్లలపై దుష్ప్రభావం చూపుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా కట్టడికి పలు దేశాలు కొత్త చట్టాలు తీసుకొస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలో అరబ్ దేశం యూఏఈ కూడా చేరింది. సామాజిక మాధ్యమ వేదికల వినియోగానికి కనీస వయసును 15 ఏళ్లుగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గురువారం ఆమోదించింది. దాంతో ఈ తరహా నిబంధన తీసుకొచ్చిన తొలి అరబ్ దేశం గా యూఏఈ నిలిచింది.కొత్త నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లలోపు చిన్నారులు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఖాతాలను తెరిచేందుకు అనుమతి ఉండదు. అంతేకాదు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లోని కొన్ని రకాల ఫీచర్లపై వీరికి యాక్సెస్ కల్పించకూడదు. వయసు సంబంధిత కంటెంట్‌పై ఆంక్షలు, స్క్రీన్ టైమ్, యాప్ వినియోగ సమయంపై పరిమితి వంటి రూల్స్‌ను ఆయా ప్లాట్‌ఫామ్‌లు తీసుకురావాల్సి ఉంటుంది. సోషల్ మీడియాతో పిల్లలకు పొంచి ఉన్న ముప్పును తప్పించడంతో పాటు ఆరోగ్యకరమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు యూఏఈ ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా ప్లాట్‌ఫామ్‌ల్లో మార్పులు చేసేందుకు సోషల్ మీడియా కంపెనీలకు యూఏఈ

-మిగతా 2 లో



## నాన్-సీరియస్ ప్లేయర్లకు ఏపీలో చోటులేదు

- -ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- -పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- -ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- -ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేష్ స్పష్టీకరణ

**అమరావతి** పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరాలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలు ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించే ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జడ్జీహెచ్ (ఆర్జీహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్లకు' ఏపీలో

-మిగతా 2 లో

# రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ టాప్..!

- షాకింగ్ నిజాలు వెల్లడించిన కేంద్ర నివేదిక
- జాతీయ సగటు కంటే భారీగా పెరిగిన ప్రమాదాలు
- ఏడాది కాలంలోనే 13.5 శాతం పెరుగుదల
- రహదారులపై నెత్తురు.. గతేడాది 7,900 మంది మృతి
- మృత్యుపాశంగా మారుతున్న 'అతివేగం'
- హిట్ అండ్ రన్, ఢీకొట్టడాలే ప్రధాన కారణాలు
- ప్రమాదాల కట్టడికి రవాణా శాఖ సరికొత్త చర్యలు




దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 25,986 కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధిరేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ప్రమాదాల కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధిరేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగంవల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా సుమారు 2,760 మంది మృత్యువాతపడ్డారు. వీటితోపాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనలు కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదుకాని చిన్నచిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం, ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ

మొదటి తరువాయి

మంది ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు ఇవ్వడంతో ఆయననే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అయితే, తాము సూచించిన ఎమ్మెల్యేను కాకుండా.. స్పీకర్ తిరుగుబాటు ఎమ్మెల్యేను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించడాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా జస్టిస్ క్రిష్ణా రావ్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని, ఇప్పటికిప్పుడు ప్రతిపక్ష నేతగా రితబ్రతను మార్చలేమని కోర్టు తెలిపింది. ఈ అంశంపై స్పందించాలని స్పీకర్‌తోపాటు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో తమ స్పందన తెలియజేయాలని కోరింది. దీనిపై స్పందించిన ప్రతివాదులు.. తాము అఫిడవిట్ సమర్పించేందుకు మూడు వారాల గడువు కావాలని కోరారు. అయితే, కోర్టు రెండు వారాల సమయం ఇచ్చింది. అలాగే, తదుపరి విచారణ జూలై 28కి వాయిదా వేసింది. అప్పటివరకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా రితబ్రతా బెనర్జీనే కొనసాగుతారని స్పష్టం చేసింది.

## కొత్త డార్క్ వెబ్‌గా

# టెలిగ్రామ్ యాప్..!

మొదటి తరువాయి

ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ÷-లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది.

# యూఏఈలో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..!

మొదటి తరువాయి

12 నెలల గడువు విధించింది. దశల వారీగా ఈ రూల్స్‌ను అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపింది. 2024 నాటి గణాంకాల ప్రకారం.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పిల్లలు సగటున రోజుకు 3 గంటలపాటు సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నారని సర్వేల్లో తేలింది. చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ తీసుకొచ్చిన తొలి దేశంగా ఆస్ట్రేలియా నిలిచింది. ఆ తర్వాత యూకే, మలేసియా లాంటి దేశాలు కూడా ఈ తరహా నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చాయి.

# అమెరికాపై విజయం సాధించాం

- ప్రకటించిన ఇరాన్
- ఫ్రాన్స్‌లో ట్రంప్-పెజెష్కియాన్ ఒప్పందం
- ట్రంప్ సంతకమే అమెరికా లొంగుబాటుకు సాక్ష్యం
- హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌దే సర్వాధికారం
- ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే ఉల్లంఘనే!
- తుది నిర్ణయానికి 60 రోజుల గడువు

**టెహ్రాన్:** ఇరాన్‌తో యుద్ధానికి ముగింపు పలుకుతూ ఫ్రాన్స్‌లో జరిగిన కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓ ఒప్పందంపై సంతకం చేసిన విషయం తెలిసిందే. 14 పాయింట్ల డాక్యుమెంట్‌పై ట్రంప్‌తో పాటు ఇరానీ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ డిజిటల్ సంతకాలు చేశారు. అయితే ఆ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చినట్లు పాకిస్థానీ మీడియేటర్లు వెల్లడించారు. ఇక ట్రంప్ సంతకం చేసిన ఆ ఒప్పందంపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాపై తాము దౌత్యపరమైన విజయాన్ని సాధించామని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. అమెరికా తన మిలిటరీ లక్ష్యాలను అందుకోలేకపోయిందని ఆ అధికారులు ఆరోపించారు. ఇరానీ పార్లమెంటరీ స్పీకర్,



అమెరికాతో చర్చల్లో పాల్గొన్న మొహమ్మద్ ఘలీబాఫ్(వీశీష్ట్రుఎఝుస +ష్ట్రుశ్రీఱఎఝుట) మాట్లాడుతూ.. అమెరికా లొంగిపోయిందని చెప్పడానికి ట్రంప్ చేసిన ఒప్పంద సంతకమే సాక్ష్యమని తెలిపారు. ఆ అగ్రిమెంట్ అనేది అమెరికా వైఫల్యానికి ఆధారామన్నారు. ఇరానీ టీవీలకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఘలీబాఫ్ మాట్లాడుతూ.. ప్రజలు ఆ అగ్రిమెంట్‌ను పరిశీలించి, దానిపై నిర్ణయాన్ని అంచనా వేస్తారన్నారు. హోర్ముజ్ జలసంధి మళ్లీ సాధారణ పరిస్థితులకు రాదు అని గట్టిగా చెబుతున్నానని ఘలీబాఫ్ అన్నారు. హోర్ముజ్‌పై సార్వభౌమాధికారం ఇరాన్‌కు ఉందని ఆయన అన్నారు. తాము చేసే సేవలకు ఫీజు తీసుకుంటామని కూడా ఘలీబాఫ్ అన్నారు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భాగేహి మాట్లాడుతూ హోర్ముజ్ జలసంధి పునరుద్ధరణ కోసం నియమావళిని రూపొందిస్తామన్నారు. దీని కోసం ఒప్పందంలో భాగంగా ఒమన్‌తో చర్చలు జరుపుతామన్నారు. ఒకవేళ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే, అప్పుడు ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లుగా భావిస్తామన్నారు. వాస్తవానికి ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం సంతకం .. తుది ఒప్పందం కాదు. ఆ రెండు దేశాల మధ్య ఉన్న వివిధ అంశాలపై చర్చించేందుకు మరో 60 రోజుల పాటు గడువు ఇవ్వనున్నారు. ఇరాన్ అణ్వాయుధాలు, ఆంక్షల సడలింపు, ఆస్తులను రిలీజ్ చేయడం, హోర్ముజ్ భవిష్యత్తుపై రాబోయే 60 రోజుల్లో నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆ తర్వాత ఆ ఒప్పందానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం ఇస్తుంది. అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ కనుసన్నల్లోనే అణ్వస్త్రాలను నిర్వీర్యం చేయనున్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

మొదటి తరువాయి

వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటును వేగవంతం చేయండి

మొదటి తరువాయి

ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోబోతున్న 'పీబీ-జీ రామ్ జీ' పథకం కిందకు నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాలి. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

**ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లండి**

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు పవన్ కళ్యాణ్ కి తెలిపారు. ఈ వర్షాకాలంలో వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాల్లో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికపై స్పందించిన పవన్ కళ్యాణ్, సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**అరుదైన మొక్కల సంరక్షణపై అభినందనలు**

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు. దీనికి 'బాంబూసా ఆంధ్రికమ్' అని నామకరణం చేశారు. ఈ చివరి పది మొక్కలను కాపాడటమే కాకుండా, వాటి సంఖ్యను మరింత పెంచేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం పట్ల అభినందించారు. అదేవిధంగా, శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరిన ఈత చెట్టు మాదిరి ఉండే 'సైకాన్ శేషాచలనిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు కూడా అటవీ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోందని తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో అటవీ పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీ శాఖ కార్యదర్శి వినయ్ చంద్, పీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సీసీఎఫ్ సోషల్ ఫారెస్ట్, జులాజికల్ పార్క్స్ బి.ఎస్.ఎన్. మూర్తి, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వానాకాలం సాగుకు రైతులకు

# అండగా ప్రభుత్వం

మొదటి తరువాయి

కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలోకి పాకిస్థాన్ సబ్‌మెరైన్..!

మొదటి తరువాయి

1971 యుద్ధంలో భారత్ చేతిలో ఘోర పరాజయం తర్వాత బంగాళాఖాతంలో పాకిస్థాన్ సైనిక ఉనికి పూర్తిగా లేకుండా పోయింది. అయితే చైనాలో తయారైన మొదటి హ్యాంగర్ జలాంతర్గామి గత వారం కరాచీ నౌకాదళ స్థావరానికి చేరుకోవడంతో.. దాని సాయంతో హిందూ మహాసముద్రంలో తమ పరిధిని విస్తరించుకోవచ్చని పాక్ భావిస్తున్నది.శ్రీలంకలోని కొలంబో ఓడరేవుకు వచ్చిన ఒక పాకిస్థాన్ యుద్ధ నౌక వేదికగా అక్కడి కమాండర్ ఒమర్ ఫారూఖ్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనాతో కుదుర్చుకున్న భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ మొత్తం ఎనిమిది హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాములను కొనుగోలు చేస్తోంది. వీటిలో నాలుగు చైనాలో తయారు కానుండగా.. మిగిలిన నాలుగింటిని కరాచీలోనే నిర్మిస్తారు. ఈ జలాంతర్గాములలో శత్రువుల రాడార్లకు చిక్కకుండా ఎక్కువ రోజులపాటు సముద్రం లోపలే మునిగి ఉండేలా గాలితో సంబంధం లేని అత్యాధునిక చోదక సాంకేతికతను ఉపయోగించారు. ఇవి తమ నౌకాదళ బలాన్ని పూర్తిగా మార్చేస్తాయని పాకిస్థాన్ అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. బంగాళాఖాతంలో విశాఖపట్నం వేదికగా ఉన్న భారత తూర్పు నౌకాదళ స్థావరానికి, ప్రధాన వాణిజ్య సముద్ర మార్గాలకు ఈ పరిణామం సవాలుగా మారే ప్రమాదం ఉంది. పైగా ఇటీవల బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు, వాణిజ్యం, సైనిక బంధాలు బలపడటం కూడా ఈ వ్యూహానికి కలిసి వస్తోంది. అయితే భారత్ ఇప్పటికే బంగాళాఖాతంలో అణు జలాంతర్గాములు, విమాన వాహక నౌకలతో అత్యంత శక్తిమంతమైన ఉనికిని కలిగి ఉంది. అండమాన్ నికోబార్ దీవులలో కూడా భారత్ తన రక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకుంటూనే ఉంది.

# నాన్-సీరియస్ ప్లేయర్లకు ఏపీలో చోటులేదు

మొదటి తరువాయి

చోటులేదని హెచ్చరించారు.

ఇథనాల్, సెమీ కండక్టర్ల పెట్టుబడి

ఇథనాల్ ఆధారిత ఇంధనాన్ని వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్ పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లిథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్స్‌లీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరి పేరున్న జోగుగిరి గోల్ఫ్ మెన్ ఉత్పత్తి వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్యాలయాలు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తి ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

# ఎస్సీ బాలుర హాస్టల్లో అడ్మిషన్లు ప్రారంభం

**ఖానాపూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో 2026--27 విద్యా సంవత్సరానికి మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం 60 సీట్లు ఖాళీగా ఉన్నట్లు సంక్షేమ అధికారి భాస్కర్ తెలిపారు.అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులు ఆధార్, ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.హాస్టల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత వసతి, పౌష్టికాహారం, పుస్తకాలు, డ్రెస్సులు, వైద్య సేవలు, పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణతో కూడిన విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.సీట్లు పరిమిత సంఖ్యలో ఉన్నందున ఆసక్తిగల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441353430 నంబర్‌ను సంప్రదించవచ్చని వార్డెన్ భాస్కర్ తెలిపారు.పేద వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టల్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.

## జాతీయ లోక్ అదాలత్‌లో ఖానాపూర్ న్యాయవాదులకు అవకాశం



**ఖానాపూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు జూన్ 20న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఖానాపూర్‌లో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రకారం, పెండింగ్ కేసులు, ప్రీ-లిటిగేషన్ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ఈ బెంచ్ ఏర్పాటు చేయబడింది. అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ నికిత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగనుంది. ఈ బెంచ్‌లో ఖానాపూర్‌కు చెందిన న్యాయవాదులు జి. నరేంద్రనాథ్, షబ్బీర్ పాషా సభ్యులుగా నియమితులయ్యారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో వివాదాలను పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని వారు తెలిపారు.జిల్లా న్యాయశాఖ తమపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, విధులను సక్రమంగా నిర్వహిస్తామని నరేంద్రనాథ్, షబ్బీర్ పాషా హామీ ఇచ్చారు.జాతీయ లోక్ అదాలత్‌లో ఖానాపూర్ న్యాయవాదులకు కీలక బాధ్యతలు అప్పగించారు.

## గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర పథకాలు అందేలా ప్రతి కార్యకర్త కృషి చెయ్యాలి



**గంగాధర, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీన్ దయాల్ ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ప్రతి కార్యకర్త గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసెంబ్లీ ప్రబారి బింగి వేణు, మల్యాల అధ్యక్షుడు గాజుల మల్లేష్, మండల ప్రబారీలు అమ్మరకొండ తిరుపతి, నరేష్, ఆకుల మనోహర్, తిప్పల వేణి శ్రీనివాస్, ఎర్రబెల్లి పరశు రాం, బొమ్మన పరమేష్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, తాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర పథకాలు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

## మోదీ పాలనపై మేధావుల సదస్సు



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 21న కరీంనగర్‌లో మేధావుల సదస్సు జరగనుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు.జిల్లా పార్లమెంట్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ, గత 12 ఏళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, గ్లోబల్ స్థాయిలో భారతదేశం సాధించిన ప్రగతిని విశ్లేషించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యావేత్తలు, నిపుణులు, పౌరసమాజ ప్రతినిధులు పాల్గొని దేశ గమనంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారని తెలిపారు.జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, ఇనుగోండ నాగేశ్వర్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, పుప్పాల రఘు, అడిచర్ల రాజు, జగన్ రెడ్డి, ఆకుల రాజేందర్, విమల్, నరేష్, బండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.జూన్ 21న కరీంనగర్‌లో మేధావుల సదస్సు జరగనుంది.

# సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు పోస్టర్ విడుదల



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్కిల్‌ఫోర్జ్ అకాడమీ ఆధ్వర్యంలో జూన్ 20న గణేష్‌నగర్ అదితి బ్యాంక్వెట్ హాల్‌లో జరగనున్న సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు పోస్టర్‌ను టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందాలంటే అవగాహన అత్యవసరమని, ఓటీపీలు, ఫేక్ లింకులు, డిజిటల్ చెల్లింపుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక్క క్లిక్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి అనే అలవాటు ప్రతి ఒక్కరికి అవసరమని పేర్కొన్నారు.ఈ ఉచిత సదస్సుకు యువత, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ముప్పిడి కిరణ్ కుమార్, రాగి శ్రీనివాస్, సర్దార్, ఆర్మీందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, కోట రామస్వామి, శంకరయ్య, జీవన్, జీనియస్ అకాడమీ చైర్మన్ అనూప్ నారాయణ, నరసయ్యతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.సైబర్ మోసాలపై అవగాహనే ప్రధాన ఆయుధమని నిర్వాహకులు స్పష్టం చేశారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**హుస్నాబాద్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మహ్మద్ ఖుద్రత్ అలీ డిమాండ్ చేశారు.హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద శాంతియుత నిరసన తెలుపుతున్న జర్నలిస్టులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన, ఆందోళన, సమ్మె హక్కులు ప్రాథమికమని, వాటిని అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉచిత బీమా పథకం అమలు చేయాలని, 60 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని, సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహ్మద్ ఖుద్రత్ అలీ డిమాండ్ చేశారు.

# ఘనంగా అమ్మ మాట అంగన్వాడి బాట



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతి రాంపూర్ సెక్టార్‌లోని గణేష్‌నగర్, ధోబివాడ అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలు, గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సూపర్వైజర్ ఎస్. అరుణ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ఆటపాటల ద్వారా నేర్పిస్తూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీలు పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి. పద్మావతి, వనజ, బి. విజయ, బి. పద్మలత, పి. విజయ, ఏఎన్ఎం సుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 మంది చిన్నారులకు కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ చేతుల మీదుగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.అంగన్వాడీ సేవలను వినియోగించుకొని పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు చురుకుగా పాల్గొనాలని అధికారులు సూచించారు.

## నీరు విడుదల చేయకపోతే రైతు ఉద్యమం చేపడతాం



**కరీంనగర్ రూరల్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి మండలంలోని గ్రామాలకు వారం రోజుల్లోగా సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి ఆచంపల్లి వద్ద మహాధర్నా చేపడతామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు. బద్దిపల్లి గ్రామంలో రైతుల ఆహ్వానం మేరకు పంట పొలాలు, చెరువులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ చుక్క వర్షం లేక బావులు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేస్తేనే పంటలు రక్షించబడతాయని తెలిపారు.గతంలో వరద కాలువ ద్వారా చెరువులను నింపి సాగునీరు అందించడంతో పాటు మత్స్యకారులకు ఆదాయం పెరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం మేడిగడ్డ నుండి నీరు రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని, వారం రోజుల్లోగా నీరు విడుదల చేయకపోతే రైతు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. లెఫ్ట్ కెనాల్ పనులను పునరుద్ధరించి శ్రీరాములపల్లి గ్రామానికి కూడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి మహాధర్నా చేపడతామని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.

# గుడిసెలు లేని గ్రామాలే ప్రభుత్వం లక్ష్యం

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**తిమ్మాపూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో గుడిసెలు లేకుండా పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలో తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరుగుతోందని, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పిస్తుందని, అందుకే పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు



చేస్తున్నామని చెప్పారు. మొదటి విడుతలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను తొలగించి, మిగితా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని, త్వరలో రెండో విడుత జాబితా విడుదలవుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ రెడ్డి, వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్, బొద్దు సునిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాతంగి అనిల్, బుర్ర తిరుపతి గౌడ్, పొన్నాల సంపత్, ఎల్లారెడ్డి తోపాటు సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసి గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# నేడు ఉచిత పిల్లల వైద్య శిబిరం.

**ఎలిగేడు, జూన్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సుధా పిల్లల హాస్పిటల్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో ఎలిగేడు గ్రామపంచాయతీ ఆవరణలో నేడు శుక్రవారం 8. గంటల నుండి10.30 వరకు ఉచిత పిల్లల వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ పరీక్షలు కూడా ఉచితంగా ఉంటుందని ఎలిగేడు గ్రామ ప్రజలు సద్వినియం చేసుకోవాలని ఆయన కోరారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



**తిమ్మాపూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూరులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. వరంగల్ రోడ్ నుంచి పోచమ్మ కల్వర్టు వరకు జరుగుతున్న పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కె. కొమురయ్య, తుర్తి అరవింద్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అల్గునూరులో డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

## ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాల పంపిణీ



**ఖానాపూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ చీర్ల విజయ్ ఆనంద్ కుమార్ చేత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలపై మోజు వద్దని తల్లిదండ్రులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ ప్రైమరీ నుండి కాలేజీ వరకు ఒకే చోట విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాన బ్రహ్మలింగం, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఏపీ చైర్మన్, ఉపాధ్యాయురాలు కె. మౌనిక తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని సర్పంచ్ విజయ్ ఆనంద్ పేర్కొన్నారు.

## తాత్కాలిక సెక్యూరిటీ గార్డులకు న్యాయమైన వేతనం ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఫంక్షన్ హాల్స్, గార్డెన్స్‌లో తాత్కాలికంగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు రోజుకు 8 గంటల పనికి రూ.800 చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో రేకుర్తి రాజశ్రీ గార్డెన్, సాయి మహాలక్ష్మి గార్డెన్, శుభం గార్డెన్, వరలక్ష్మి గార్డెన్ తదితర మేనేజర్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో గార్డులకు తగిన వేతనం ఇవ్వాలని, అలాగే ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నోముల జగన్, పరుశు రాం, సుంకరపల్లి ప్రవీణ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. తాత్కాలిక సెక్యూరిటీ గార్డులకు న్యాయమైన వేతనం ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేసింది.

## సీసీ కెమెరాలు.. రక్షణ నేత్రాలు

**- ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామానికి రక్షణ నేత్రాలుగా ఉపయోగపడుతాయని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామ పంచాయతీ ప్రజల భద్రతలో భాగంగా గ్రామ సర్పంచ్ తెల్గమల్ల ప్రశాంతి రవికుమార్ అధ్వర్యంలో 65 వేల రూపాయలను సమకూర్చి ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. గ్రామ పాలకవర్గాలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేరాలు జరిగినప్పుడు కెమెరాల ద్వారా గుర్తించడం సులభమవుతుందన్నారు. వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, ధ్రువపత్రాలు ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పబ్బతి శ్రీను, వార్డు సభ్యులు సందమల్ల బొబ్బిలి, బొడ్డుపల్లి లక్ష్మయ్య గ్రామ యువకులు దొడ్డి పరమేష్, తిరుపతి, మద్దెల వెంకటయ్య, ముత్యాల నర్సింహా, నారుమళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు స్కూలు బస్సులు అడ్డగింత



**పాలకుర్తి, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం గురువారం కూడా ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను గ్రామ శివారులో అడ్డగించింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని పాలకవర్గం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయాన్ని కొందరు సమర్థిస్తుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. బడి వసతులు సరిగా లేవని, అపరిశుభ్రంగా ఉందని, ఆకతాయిలు బడి ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, ప్రభుత్వం నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందజేస్తుందని, ప్రభుత్వ బడికి పూర్వ వైభవం తీసుకురావడంలో అందరి సహకారం కావాలని తల్లిదండ్రులను నచ్చజెప్పారు. దీంతో ఒక్కరోజులోనే ప్రైవేటు స్కూలు నుండి ప్రైమరీలో 22 మంది, హై స్కూలులో 8 మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు. ఆదివారం రోజున జిల్లా విద్యాశాఖ అధికారులతో గ్రామస్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రైవేటు బస్సులు అడ్డగింతతో ఒక్కరోజులోనే 30 మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు.


## ఔట్సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికులను పర్మనెంట్ చేయాలని మున్సిపల్ కార్మికుల నిరసన



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు రెండు రోజుల దీక్ష ప్రారంభమైంది. జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు దీక్షను ప్రారంభించారు. సుమారు 250 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని, ఔట్సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ పే కార్మికులను పర్మనెంట్ చేయాలని, రెండో పిఆర్సి ప్రకటించి కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ పరికరాలు, చెప్పులు, రేయిన్ కోట్లు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కరీంనగర్‌లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రి డ్యూటీ చేసే కార్మికులకు రవాణా, రెస్టు రూములు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలకు పన్నుల్లో వాటా లేకుండా ప్రభుత్వాలు ఆర్థిక విధానాలు రూపొందిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జి. రాజేశం, ముక్కెర బుజ్జమ్మ, కవ్వంపల్లి రవి, కాంపల్లి పోచయ్య, మానుపాటి మల్లేశం, దేవునూరి శ్యాంసుందర్, దాసరి రాజమల్లయ్య, బందిలి తిరుపతి, బడిగల చంద్రయ్య, బి. వెంకటస్వామి, కొంకంటి పద్మ, పురత్తం రాధ మొండయ్య తదితరులు పాల్గొన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపడతామని కార్మికులు హెచ్చరించారు.

## శ్రీశైలంలో దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు

**త్రిమూర్తి స్వరూపుని ఆరాధన**



**శ్రీశైలం, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లోకకల్యాణం కోసం శ్రీశైలం దేవస్థానంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ప్రతి గురువారం సర్కారీ సేవగా ఈ కైంకర్యం జరుగుతుందని అధికారులు తెలిపారు. ముందుగా మహాగణపతిపూజ జరిపి, అనంతరం పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపముగా అవతరించిన త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుని ఆరాధనకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల సంబంధం ఎంతో ప్రత్యేకమని పురాణాలు చెబుతున్నాయి. త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులు తపస్సు చేసినట్లు ప్రతీతి. కలియుగంలో గోదావరి తీరం పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా, అనంతరం మహారాష్ట్రలో నృసింహసరస్వతిగా అవతరించి శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతం ఆచరించినట్లు గురుచరిత్ర పేర్కొంటుంది. నృసింహసరస్వతి స్వామి శ్రీశైలంలోని పాతాళగంగలో అవతార సమాప్తి చేసి, అదృశ్య రూపంలో భక్తులను రక్షించేందుకు నిర్ణయించుకున్నారని గ్రంథాలు చెబుతున్నాయి. కదళీవనం వద్ద శిష్యుల సమక్షంలో అరటి ఆకుల ఆసనంపై కూర్చొని కృష్ణానదిలో ప్రవేశించి అదృశ్యమైనట్లు గురుచరిత్రలో వివరించబడింది.

## నిబంధనలకు విరుద్ధంగా బదిలీలపై విచారణ జరుపాలని ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలు, సీనియారిటీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు కె. బద్రినేతతో కలిసి డీఎం అండ్ హెచ్ఓకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు చామనపల్లి పీహెచ్‌సీలో ఎంపీహెయోగా పనిచేస్తున్న చిలుక లింగయ్య సీనియారిటీ వివరాలను తప్పుగా చూపించి బదిలీల నుండి తప్పించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఫోకల్ టు ఫోకల్ బదిలీలు పొందడం, అక్రమంగా హెచ్ఆర్ఏ పొందడం వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదును స్వీకరించిన డీఎం అండ్ హెచ్ఓ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు నిరూపితమైతే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫోకల్ టు ఫోకల్ బదిలీలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎం అండ్ హెచ్ఓ స్పష్టం చేశారు.

## విజయవంతంగా ముగిసిన జేఎస్ఆర్ చలివేంద్రాలు



**హుస్నాబాద్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు విజయవంతంగా ముగిశాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ వేసవిలో కూడా ప్రజల దాహార్తిని తీర్చేందుకు 20 చలివేంద్రాలను ఏర్పాటు చేసి, సుమారు 25 లక్షల లీటర్ల కూల్ మినరల్ వాటర్‌ను ప్రజలకు అందించారు. ఇందుకోసం జేఎస్ఆర్ స్వంతంగా రూ.50 లక్షలు వెచ్చించారు. వేసవి తీవ్రతలో బాటసారులు, వాహనదారులు, ప్రజలకు ఉచితంగా చల్లని నీరు అందించడం ద్వారా వేలాది మందికి ఉపశమనం కలిగిందని స్థానికులు తెలిపారు. 100 రోజుల పాటు చలివేంద్రాల నిర్వహణలో కీలకంగా పనిచేసిన టీం సభ్యులు రాహుల్, అఖిల్‌లను జేఎస్ఆర్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, సీనియర్ నాయకులు కాయిత అరుణ్ రెడ్డి, టౌన్ కార్యదర్శి బుర్ర రాజు, టీం జేఎస్ఆర్ సభ్యులు పాకల రాజిరెడ్డి, కనకం వెంకట్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాసేవలో భాగంగా జేఎస్ఆర్ చేపట్టిన చలివేంద్రాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**శంకరపట్నం, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మౌలిక వసతులు కీలకమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ధర్మారం గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.41 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పుడే గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శిస్తూ, ప్రస్తుతం కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, తాగునీటి పథకాలు చేపడుతున్నామని తెలిపారు. ధర్మారం గ్రామంలో సీసీ రోడ్డు పూర్తయితే వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రవి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, గ్రామ సర్పంచ్ చింతిరెడ్డి పద్మ, పార్టీ నాయకులు దేవునూరి కిష్టయ్య, నాంపెల్లి తిరుపతి, గట్టు తిరుపతి గౌడ్, గోపగోని బస్వయ్య గౌడ్, ఉప్పుగళ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మౌలిక వసతులు అత్యవసరమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

**- డిప్యూటీ మేయర్ సునీల్ రావు**



**రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాజన్న సిరిసిల్లలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అపూర్వమైన ప్రగతిని సాధించిందని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా దేశ భద్రతను పటిష్టం చేస్తూ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, అదే తరహా అభివృద్ధి తెలంగాణలో జరగాలంటే బీజేపీకి అధికారం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి బోయిన గోపి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.తెలంగాణలో అభివృద్ధి డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారానే సాధ్యమని సునీల్ రావు స్పష్టం చేశారు.

## ఆరవ డివిజన్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ మేకల వెంకటేష్‌తో కలిసి ఆరవ డివిజన్‌లో పర్యటించారు.మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించిన మేయర్, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపల్ సంస్థ ప్రధాన బాధ్యత అని, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యుడు పాశం తిరుపతి, బీజేపీ నాయకులు సాయవేణి సదానందం, గాలిపెల్లి నారాయణ, కాల్వ రామచంద్రం, పెద్ది లక్ష్మణ్, నేరెళ్ళ శ్రీను, పోగుల సాయి చంద్, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ వర్కర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది అని మేయర్ స్పష్టం చేశారు.


## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి



**గుర్రంపోడు, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలం చేపూరు గ్రామ సర్పంచ్ మారెపాక ఈశ్వరమ్మ కుమారుడు మారెపాక నరేందర్ – భారతిల వివాహ మహోత్సవం ధర్వేశిపురం లోని శ్రీ వేద ఫంక్షన్ హాల్ నందు అత్యంత వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ వేడుకకు నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను పుష్పగుచ్ఛం అందించి, అక్షింతలు వేసి నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆశీర్వదించారు.ఈ శుభకార్యంలో ఆయనతో పాటు జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ విరిగిపెద్దులు, కొండేటి మల్లయ్య,గుర్రంపోడు మాజీ ఎంపీపీ చనమల్ల మాధవి జగదీశ్వర్ రెడ్డి సూదిని జగదీశ్వర్ రెడ్డి వెలగపురి కర్ణాకర్ రావు బొమ్ము శ్రీను కుప్ప అమరేందర్ మేడి వెంకన్న అయితగోని వెంకటేశ్వర్లు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ పఠన దినోత్సవం – జ్ఞాన వికాసానికి పుస్తకం పునాది

జూన్ 19న జరుపుకునే జాతీయ పఠన దినోత్సవం మనకు పుస్తక పఠన ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. పఠనమే ప్రగతికి తొలి మెట్టు అనే నానుడి నేటికీ సజీవ సత్యమే. పుస్తకం మనిషి జీవితాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనం. పఠనం ద్వారా జ్ఞానం పెరగడమే కాకుండా ఆలోచనా శక్తి, విశ్లేషణాత్మక దృక్పథం, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతాయి.ఈ దినోత్సవం భారత గ్రంథాలయ ఉద్యమ పితామహుడిగా పేరొందిన పి.ఎన్. పణికర్ స్మారకార్థం జరుపుకుంటారు. ఆయన కృషి వల్ల కేరళలో అక్షరాస్యత ఉద్యమం విస్తరించి, రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచింది. 1996లో కేరళ ప్రభుత్వం ఆయన మరణదినాన్ని పఠన దినోత్సవంగా ప్రకటించగా, తరువాత దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.జూన్ 19 నుంచి జూలై 18 వరకు పఠన మాసంగా నిర్వహిస్తూ పుస్తక ప్రదర్శనలు, పఠన ప్రచారాలు, డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రంథాలయ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయి. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పఠన ప్రతిజ్ఞలు, కథా వాచనాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పుస్తక దాన కార్యక్రమాలు చేపడతాయి.డిజిటల్ యుగంలో మొబైల్, సామాజిక




మాధ్యమాల ప్రభావంతో పఠన అలవాటు తగ్గిపోతున్న తరుణంలో ఈ దినోత్సవం పుస్తకాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తోంది. పుస్తకం మనిషికి ఉత్తమ మిత్రుడు. మంచి పుస్తకం ఒక జీవితాన్నే మార్చగలదు. రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని పఠనానికి కేటాయించడం ద్వారా జ్ఞానంతో పాటు మానసిక వికాసం సాధ్యమవుతుంది. చదివే మనిషి ఎదుగుతాడు -- చదివే సమాజం అభివృద్ధి చెందుతుంది.

చదివే భారతం -- అభివృద్ధి భారతం.
ఈరోజు ఒక పుస్తకం చదవండి, రేపు ఒక ప్రపంచాన్ని గెలవండి.

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్, ఎం.ఎస్సీ., ఎం.ఏ., ఎం.ఎడ్.,**
**అధ్యాపకులు**
**9912775834**



## ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను సాధించాలి

**- కలెక్టర్ హైమావతి**




**సిద్దిపేట, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు.ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రోగ్రెస్--2026-27 సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెటీరియల్ కాంపోనెంట్ ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని సూచించారు. రైతులతో సమన్వయం కొనసాగిస్తూ భూముల క్లీనింగ్, పిట్ మార్కింగ్, పిట్టింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయిల్ పామ్‌తో పాటు పండ్లు, పూలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని, ఆర్గానిక్ మరియు సీజనల్ పంటల ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రైతును ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రతి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సీడ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో విత్తనాల వివరాలను ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.దూల్మిట్ట, ఆకారం, బక్రీచెప్యాల, నంగునూరు, చిట్టాపూర్ గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

## అక్రమ ఇసుక డంపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో అక్రమ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మానకొండూర్, కొత్తపల్లి మండలాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. మానకొండూర్ మండలంలోని వెల్ది గ్రామ పరిధిలో 6 భారీ ఇసుక డంపులు, 2 ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీటిలో 56 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొత్తపల్లి మండలంలోని కాజీపూర్ గ్రామంలో 2 అక్రమ ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు నిర్ధారించారు.స్వాధీనం చేసిన ఇసుక





నిల్వలు, వాహనాలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, మైనింగ్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.అక్రమ ఇసుక రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం - అడ్మిషన్లు పెంపు లక్ష్యం




**కమలాపూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కమలాపూర్ మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ స్కూల్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ ప్రారంభించారు. అనంతరం కొత్తగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలు పెరగాలని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పబ్బు సతీష్, ఎంఈఓ శ్రీధర్, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శివకుమార్, పాఠశాల హెడ్‌మాస్టర్ మల్లిక్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, వార్డు సభ్యులు పుల్ల శ్రీనివాస్, జన్ను స్వప్న, పుల్ల శోభన్, గూడెపు మొగిలయ్య, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంపు, అక్షరాభ్యాసం ప్రోత్సాహం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

## మంత్రి లక్ష్మణ్పై విమర్శలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్, ఆర్ఎస్పీ



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హరీష్ రావు మెప్పు కోసం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.జిల్లా కేంద్రంలోని అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సంక్షేమ శాఖలో అవినీతి ఆరోపణలు నిరాధారమని, పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని తెలిపారు. రూ.1183 కోట్లకు టెండర్లు పిలిచినప్పటికీ, హరీష్ రావు 2 వేల కోట్ల అవినీతి ఆరోపణలు చేయడం అసత్యమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ అవమానానికి గురైనప్పుడు తాను సాటి దళితుడిగా అండగా నిలిచానని గుర్తు చేశారు. ధర్మపురి నియోజకవర్గానికి ఆయన ఏ అభివృద్ధి చేయలేదని, డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ డిపో తీసుకురాకపోవడంతో ప్రజలు 2023 ఎన్నికల్లో బుద్ధి చెప్పారని అన్నారు. జీవన్ రెడ్డి వడ్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేస్తున్నారని, ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో ఎంత కమీషన్ పొందారో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు.సంక్షేమ శాఖలో అవినీతి ఆరోపణలు నిరాధారమని, బీఆర్ఎస్ నేతల విమర్శలు దొర మెప్పు కోసం చేస్తున్నవేనని మంత్రి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యానించారు.

## పోచమ్మ తల్లి బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవంలో జేఎస్ఆర్



**హుస్నాబాద్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గాంధీనగర్ గ్రామంలో జరిగిన పోచమ్మ తల్లి బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యకవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోలు సంపత్, ఉపసర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు మేదిని ఆంజనేయులు, గంటల సంపత్, మాజీ వైస్ ఎంపీపీ రాంగోపాల్ రావు, మాజీ ఎంపీటీసీ జనగామ రాజేశ్వరరావు, వెంకటేశ్వర్ రావు, రామ్మోహన్ రావు, సతీష్, సారయ్య నారాయణరావు, దేవేందర్, దినేష్, అజయ్, జనార్ధన్, సుధాకర్, సందీప్, శ్రీనివాస్, అరవింద్, శ్రీకాంత్‌తో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం అమ్మవారి ఆశీస్సులు కోరుతూ మహోత్సవం ఘనంగా జరిగింది.

## పరిశుద్ధ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ 41వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించిన ఆయన, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపల్ సంస్థ ప్రధాన బాధ్యత అని, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాంపెల్లి రేణుక శ్రీనివాస్, పొన్నం మండయ్య గౌడ్, బొడ్ల శ్రవణ్ కుమార్, అప్పిరాజ్ వంశీ, రమేష్, సర్దార్ అరుణ్ సింగ్, బల్బీర్ సింగ్, పైడ రవి, చంద్రమౌళి, ప్రభాకర్, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ వర్కర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది అని మేయర్ స్పష్టం చేశారు.

## ఎరువుల గోదాములను పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ నగునూరు గ్రామంలోని ఎరువుల గోదాములను పరిశీలించారు. జిల్లాలో ఎరువుల పంపిణీ, విక్రయ కేంద్రాలు, ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. వరి, మొక్కజొన్న, పత్తి విత్తన నిల్వలను గోదాముల్లో పరిశీలించిన అనంతరం అగ్రో రైతు సేవా కేంద్రంలో బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508, కేఎన్ఎం-1638 వంటి వరి వంగడాలను పరిశీలించారు. టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ సరఫరా చేసిన పెసర, జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు. రైతులకు పాయింట్ ఆఫ్ సేల్ యంత్రం ద్వారా జరిగే అమ్మకాల విధానాన్ని వివరించి, ఆధార్ నమోదు చేసి ఈ-పాస్ యంత్రం ద్వారా ఎరువుల విక్రయ ప్రక్రియను పరిశీలించారు. గత వానాకాలంలో జిల్లాకు సరఫరా అయిన ఎరువుల వివరాలు, అక్టోబర్ వరకు ప్రతిపాదిత సరఫరా వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న బఫర్ స్టాక్స్, సెంట్రల్ రిజర్వ్ పూల్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న నిల్వలను పరిశీలించి మార్క్‌ఫెడ్ డీఎం, వ్యవసాయ అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకుడు కే. రణధీర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సత్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఎరువుల పంపిణీ, నిల్వలపై అదనపు కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ ఆందోళన




**అమ్రాబాద్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం.డి. సయ్యద్ డిమాండ్ చేశారు. అచ్చంపేట ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, స్కూళ్లు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని, విద్యను వ్యాపారంగా మార్చేశారని విమర్శించారు. పాఠ్యపుస్తకాల పేరుతో అధిక ధరలకు విక్రయాలు జరుపుతూ కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలపై ఆకస్మిక తనిఖీలు జరిపి, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని త్వరగా అమలు చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అచ్చంపేట తాలూకా నాయకులు శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తప్పనిసరిగా తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.

## ఆలయ నిర్మాణానికై టీటీడీ చైర్మన్ను కలిసిన వెలిచాల



**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుతో హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు ఆలయాన్ని ఉత్తర తెలంగాణ భక్తులకు సౌకర్యవంతంగా, దేదీప్యమానంగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణ అభివృద్ధి, పార్కింగ్ సదుపాయాలు, పరిశుభ్రత, తాగునీటి వసతి, దర్శన ఏర్పాట్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, పరిసరాల సుందరీకరణ వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఆలయ నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ కృషి చేస్తుందని తెలిపారు. కరీంనగర్ టీటీడీ ఆలయం ఆధ్యాత్మికతకు ప్రధాన కేంద్రంగా నిలుస్తుందని, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిర్మాణం చేపడతామని రాజేందర్‌రావు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన బి.ఆర్. నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర తెలంగాణ భక్తులకు చేరువగా కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది.

## III టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అప్పగింత




**కరీంనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ III టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 7 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జి. తిరుమల మాట్లాడుతూ, ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు నమోదు చేస్తే ఫోన్లను బ్లాక్ చేసి, ట్రేస్ చేసి తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సైబర్ అవగాహనపై ఆయన హెచ్చరిస్తూ, పోయిన ఫోన్లలో ఉన్న వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ యాప్స్, సోషల్ మీడియా ఖాతాలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని, వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయించుకోవడం, పాస్‌వర్డ్లు మార్చుకోవడం అవసరమని సూచించారు. సైబర్ మోసాలకు గురైనట్లయితే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు. తమ ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీతో తిరిగి అందజేస్తూ ప్రజల విశ్వాసాన్ని పెంచుతున్న కరీంనగర్ పోలీసులు.

## కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేస్తుంది - రాజిరెడ్డి



**మానకొండూర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లింగాపూర్ గ్రామ యువకులు బీజేపీ కార్యకర్తలని చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారని ప్రచారం చేయడం సిగ్గుచేటు అని బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి విమర్శించారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టిస్తున్నారని, చేరిన యువకుల్లో ఎవరికీ బీజేపీ ప్రాథమిక సభ్యత్వం లేదని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం హాస్యాస్పదమని, మానకొండూర్ నుంచి వేగురుపల్లి వరకు రోడ్డు దారుణ స్థితిలో ఉందని, 12 ఏళ్లుగా బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు వాగ్దానం చేసిన నిధులు, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్లు, కాంట్రాక్టర్ల చెల్లింపులు అన్నీ బకాయిలేనని, సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడమే కాంగ్రెస్ కుట్ర అని, చేరిన యువకుల్లో ఎంతమందికి బీజేపీ సభ్యత్వం ఉందో నిరూపించాలని, లేదంటే మండల కేంద్రంలో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేస్తోందని రాజిరెడ్డి తీవ్రంగా విమర్శించారు.

## ఘనంగా వనోత్సవం



**అమ్రాబాద్, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ చెరువు వద్ద వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వన మహోత్సవాన్ని పండుగలాగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ చెట్లు నాటడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి రేవంత్ చంద్ర, గ్రామ సర్పంచ్ మంజుల రాజారాం, డిప్యూటీ సర్పంచ్ రమణ గౌడ్, మండల అధ్యక్షులు రహీం, శ్రీనివాసులు, సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా వనోత్సవం ఉత్సాహంగా సాగింది.

### తెలుగు భాషను విస్మరించొద్దు: మంత్రి లోకేష్




**కర్నూలు, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పబ్లిక్ పరీక్షల్లో మ్యాథ్స్, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో అధికశాతం విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారని మంత్రి లోకేష్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. "ఎట్టి పరిస్థితుల్లోనూ మాతృభాష తెలుగును విస్మరించొద్దు. ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించాలని, బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారు చేసి అందజేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరును మెరుగుపర్చడంపై టీచర్లు శ్రద్ధ వహించాలని, హైస్కూలు విద్యార్థులకు త్వరలో క్రోమ్ బుక్స్‌తో కంప్యూటర్ ల్యాబ్స్ అందజేయడానికి చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## నేడు పెద్దపల్లిలో కవిత పర్యటన




**పెద్దపల్లి, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. జిల్లా ఇంఛార్జి సలేంద్ర కొమరయ్య యాదవ్ పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, ఉదయం 10 గంటలకు మంథని ఫ్లైఓవర్ వద్ద కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతారని తెలిపారు. అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, స్థానిక వ్యాపారులను ప్రోత్సహించే ఉద్దేశంతో మిలాన్ స్వీట్ హౌస్‌ను సందర్శిస్తారని వివరించారు. తరువాత జెండా చౌరస్తా, పెద్దకాల్వ బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీ భావజాలం, ఉద్యమ లక్ష్యాలను వివరించనున్నారని పేర్కొన్నారు. జెండా పండుగ విజయవంతం కావడానికి పార్టీ శ్రేణులు, ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొనాలని సలేంద్ర కొమరయ్య పిలుపునిచ్చారు. కవిత పర్యటనతో పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపబడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


# కోదండ రామాలయ అభివృద్ధికి దుకాణ సముదాయాలు


ఎలిగేడు మండల కేంద్రంలోని కోదండ రామాలయం


సీతారాముల విగ్రహాలు

**-ఆలయానికి శాశ్వత ఆదాయం సమకూర్చే దిశగా గ్రామస్తుల ముందడుగు**

**ఎలిగేడు, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని అతి ప్రాచీనమైన కోదండ రామాలయం అభివృద్ధి కోసం గ్రామంలోని పలువురు ప్రముఖులు, గ్రామస్తులు కలిసి ఆలయ ఆవరణలో దుకాణ సముదాయాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ ఆలయంలో క్షేత్రపాలకుడిగా హనుమంతుడు, నవగ్రహాలు, ధ్వజస్తంభం, గరుత్మంతుడు, శ్రీరాముడి పట్టాభిషేక పరివారం భక్తులను ఆకర్షిస్తాయి. అదేవిధంగా అరుదుగా లభించే సాలగ్రామాలు ఆలయంలో ఉండటం ఆలయ పవిత్రతను మరింతగా చాటుతోంది. అయితే,


నిర్మాణంలో ఉన్న ఆలయ దుకాణ సముదాయం

ఇటీవలి కాలంలో ఆలయ ఆదరణ తగ్గిపోవడంతో పూజాది కార్యక్రమాలు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక కథనంలో ప్రస్తావించబడింది. మీఈ పరిస్థితిని మార్చేందుకు గ్రామంలోని దాతలు, పెద్దలు, ప్రజలు ముందుకు వచ్చి ఆలయ ఆవరణలో దుకాణ సముదాయాలను నిర్మిస్తున్నారు. దుకాణాల అద్దె ద్వారా వచ్చే ఆదాయం ఆలయ సమగ్ర అభివృద్ధికి వినియోగించబడుతుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయాలకు శాశ్వత ఆదాయం సమకూర్చే దిశగా గ్రామస్తులు వర్తక, వాణిజ్య, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్న వారు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరుతున్నారు.

## నల్లెల్లలో ఘనంగా అక్షరాభ్యాసం



**కురవి, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లెల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రామ సర్పంచ్ రెంటాల కృష్ణ స్వయంగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిపాల్, ఉపాధ్యాయులు, యువజన సంఘం అధ్యక్షులు బండి దీపక్ గౌడ్, అంగన్వాడి టీచర్లు, మహిళా సమైక్య నాయకురాలు హూస్సేన్ బీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తల్లి మరణం తట్టుకోలేక కొడుకు మృతి




**తెల్కపల్లి, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెల్కపల్లి మండలంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కన్నతల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. గ్రామానికి చెందిన కొంగరి నర్సమ్మ (83) ఈ నెల 10న వయోభారంతో మృతి చెందారు. తల్లి లేని బాధతో పాటు ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా కలచివేయడంతో కుమారుడు కొంగరి వెంకట్రాములు (53) బుధవారం ఉదయం ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. గురువారం తల్లి దశదినకర్మ ఉండగా ఈ ఘటన గ్రామంలో మరింత విషాదాన్ని నింపింది. తల్లి--కొడుకుల వరుస మరణాలతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

## క్రమశిక్షణతో ప్రజల మన్ననలు పొందండి

**-నంద్యాల పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్స్ పెరేడ్**



**నంద్యాల, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం నంద్యాల పోలీస్ కార్యాలయ మైదానంలో హోంగార్డ్స్ పెరేడ్, దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 60 మంది హోంగార్డులు హాజరయ్యారు. హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ కవాతును పరిశీలించి, అనంతరం మాట్లాడుతూ, "హోంగార్డ్స్ సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. ప్రతి సంవత్సరం హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి" అని సూచించారు. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రయోజనాలు, ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు హోంగార్డులకు అవగాహన కల్పించారు. "క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. నంద్యాల జిల్లాకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలి" అని కమాండెంట్ ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పీ బి. చిన్ని కృష్ణ, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు, విజయ్, ఆర్ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆత్మకూరులో పీజీఆర్ఎస్ కార్యక్రమం

**-జూన్ 19న ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో నిర్వహణ**



**నంద్యాల, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పరిపాలన చేపట్టిన "వన్ మంత్ -- ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జూన్ 19న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మండల ప్రజలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే ఈ వేదిక ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. "ఆత్మకూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలి" అని విజ్ఞప్తి చేశారు.

## డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**-ఎస్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ ముదిగొండ**



**దేవరకొండ, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగినవని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ ముదిగొండ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విధానాలు, రాజకీయ అభిప్రాయాలు, ప్రజా అంశాలపై విమర్శలు సహజమని, అయితే వ్యక్తుల శారీరక రూపం లేదా వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. డా. ప్రవీణ్ కుమార్ స్వేరో నెట్‌వర్క్ ద్వారా వేలాది మంది పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు విద్య, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ శిక్షణ అందించి సమాజ అభివృద్ధికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. "అలాంటి సేవలను గుర్తించి గౌరవించాల్సిన సమయంలో వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం బాధాకరం" అని అన్నారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు స్వేరో నెట్‌వర్క్‌కు చెందిన విద్యార్థులు, యువత, సామాజిక న్యాయాన్ని విశ్వసించే అనేక మంది మనోభావాలను దెబ్బతీశాయని వెంకట్ ముదిగొండ పేర్కొన్నారు. ఆయన డిమాండ్ చేస్తూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, స్వేరో కుటుంబానికి క్షమాపణ చెప్పాలి" అని స్పష్టం చేశారు.

## ఐఐటి సీటు సాధించిన డిండి మోడల్ స్కూల్ విద్యార్థులు







**దేవరకొండ జూన్ 18. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
2025-26 విద్యాసంవత్సరం గాను నల్లగొండ జిల్లా డిండి మండలం కేంద్రంలో గల మోడల్ జూనియర్ కళాశాల (ఆదర్శ పాఠశాల) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో వద్య శ్రీరామ్ ఎస్.టి.కాటగిరిలో 352 వర్యాంక్ , వద్య కిరణ్ 967 ర్యాంకు సాధించి ఐఐటీ ఖారగ్ పూర్ లో సీట్ సాధించారు. వీరు డిండి మండలం శక్రు తండాలో నిరుపేద కుటుంబానికి చెందినవారు ఇంటర్ విద్య డిండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో విద్యనభ్యసించారు. ఐఐటి లో సీట్ సాధించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయల నగదు పురస్కారం స్వీకరించారు. అందకుగాను మోడల్ స్కూల్ ఎడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి, కళాశాల ప్రిన్సిపాల్ డి.నారియణరెడ్డి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే

**ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**



**దేవరకొండ, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేవరకొండ పట్టణంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా 20వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. మున్సిపల్ అధికారులు, చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానిక సమస్యలను పరిశీలించి ప్రజల వినతులను స్వీకరించారు. పర్యటనలో భాగంగా ఇళ్లులేని నిరుపేద కుటుంబాలకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మురికి కాలువలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను పరిశీలించి వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. తరువాత దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నగరాభివృద్ధి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. "కేవలం ఒక వార్డు మాత్రమే కాకుండా దేవరకొండ మున్సిపాలిటీ మొత్తం పరిశుభ్రంగా, అందంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడం ప్రభుత్వ లక్ష్యం" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లెంకలపల్లిలో ఉరుములు--మెరుపులతో భారీ వర్షం



**మర్రిగూడ, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని లెంకలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామ శివారులోని ముఖేష్ కుంట నిండిపోవడంతో అలుగు లేకపోవడం వల్ల వర్షపు నీరు చండూర్ మాల్ ప్రధాన రహదారిపై ప్రవహించింది. పరిసర లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరడంతో నల్లగొండ మాల్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

# పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణను అలవర్చుకోవాలి






- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఉప్పల బాలికల ఆశ్రమ పాఠశాల ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రులు
- ఉప్పల వెంకటేష్ సేవలు అభినందనీయం



**ఆమనగల్లు, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమ శిక్షణను అలవర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. గురువారం తలకొండపల్లి మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఏర్పాటు చేసిన ఉప్పల బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్చార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, శేషారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మన్ రజిని సాయిచంద్ తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బాలికల విద్యాభివృద్ధికి ఇటువంటి విద్యాసంస్థలు ఎంతో దోహదపడతాయని విద్యా, సామాజిక రంగాల్లో అయన చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఉప్పల వెంకటేష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి కోసం ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉప్పల వెంకటేష్ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, నాగిళ్ళ జగన్, అనూష శ్రీశైలం, ఆంజనేయులు యాదవ్, భాగ్యమ్మ రఘు, రమేష్, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం, మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి, నాయకులు గుత్తి బాలస్వామి, సయ్యద్ ఖలీల్, కుమార్, నిరంజన్ గౌడ్, వడ్డేమోని శివకుమార్, అల్లాజీ, కిరణ్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తుకు బానిస -- మనిషి చిత్తు

-పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని ఎస్ఐ మణికంఠ సూచన




**నందికొట్కూరు, జూన్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని మద్దురునగర్‌లో మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక సదస్సు జరిగింది. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సబ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించారు.ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, "మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మత్తుకు బానిస అయితే మంచి జీవితం చిత్తు అవుతుంది" అని హెచ్చరించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు పాల్గొని మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పొందారు. "సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" అని సబ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ పిలుపునిచ్చారు.

## సామాజిక సద్భావన సమావేశం



**ఆమనగల్లు, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కుల రాజకీయాలు దేశ సౌభాగ్యానికి సమైక్యతకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని అఖిల భారత వన వాసి కళ్యాణ క్షేత్రం సంఘట ప్రముఖ రామచంద్రయ్య చెప్పారు. గురువారం ఆమనగల్లు సత్యసాయి మందిరంలో సామాజిక సద్భావన సమావేశం నిర్వహించారు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో పూర్వకాలం నుండి వృత్తిపరంగా కులాలు ఉన్నాయని నేడు రాజకీయ నాయకులు కులాలను స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని చెప్పారు ప్రతి ఒక్కరు గడప లోపల కులం గడప దాటాక హిందువులం అనే భావనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో చెక్కల లక్ష్మణ్, దొంతు సత్యనారాయణ, దొంతు విశ్వనాథం, గుజ్జరి తిరుపతయ్య, చుక్క అల్లాజీ గౌడ్, బావండ్ల అంజయ్య, పాపిశెట్టి రాము, తోట గిరి యాదవ్, ఆనంద్, గోరటి నర్సింహా, మేడిశెట్టి శ్రీధర్, చంద్ర శేఖర్, కృష్ణ యాదవ్, పాతకోట శ్రీశైలం, ఆనంద్, రాంపాల్, దుర్గయ్య మరియు కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడీగా ఎంగలి బాలకృష్ణ



**ఆమనగల్లు, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 2026 - 2027 సంవత్సరానికి గాను 41వ అధ్యక్షుడిగా లయన్ బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ పీఆర్ఓ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి మాజీ గవర్నర్ జీ. చెన్నకిషన్ రెడ్డి, జూలూరి రమేష్ బాబు, మల్టిపుల్ చైర్మన్ లయన్ సందడి నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రి చైర్మన్ వి దామోదర్ రెడ్డి, రీజియన్ చైర్మన్ ఎస్ జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ క్లబ్ సభ్యుల సమక్షంలో అధ్యక్ష పదవిని ఎంగలి బాలకృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాషా పేర్కొన్నారు. 2026 - 27 సంవత్సరానికి గాను క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎమ్ రామ్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ గా గంప శ్రీను, పీఆర్ఓగా పాషాలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడు సభ్యులపై నమ్మకం ఉంచి ఈ అవకాశాన్ని అందించినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతీ రైతుకు పారదర్శకంగా యూరియా

- ఏడీఏ శోభారాణి




**ఆమనగల్లు, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** యాప్ ద్వారా ప్రతీ రైతుకు పారదర్శకంగా యూరియా పంపిణీ జరుగుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు శోభారాణి అన్నారు. గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. యూరియాను పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని డీలర్లను ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పనిసరిగా రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. రైతులు సాగుచేస్తున్న భూమి వివరాలను తప్పులు లేకుండా యాప్ లో నమోదు చేసుకోవాలని, ఆ తర్వాత యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

## ఓటర్ జాబితా సవరణలో పారదర్శకత అవసరం



**కల్వకుర్తి, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో ఎన్నికల కమిషన్ చేపట్టనున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. 2002 ఓటర్ లిస్ట్ ఆధారంగా సవరణ జరగడం వల్ల అనేక మంది ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. టీపీసీసీ, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీ నుండి ఇల్లు ఇల్లు తిరిగి ఓటర్ల జాబితాలను సరిచేసే కార్యక్రమాలు అధికారులు చేపట్టనున్నారని తెలిపారు.రాబోయే ఎన్నికలు కొత్తగా నమోదు అయ్యే ఓటర్ల జాబితా ప్రకారం జరుగుతాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## వెల్దండ బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వెల్దండ, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. హాస్టల్ కిచెన్, గదులు, ప్రహరీ గోడలను పరిశీలించిన కలెక్టర్‌కు స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ హాస్టల్ భవనం 39 ఏళ్లుగా శిథిలావస్థలో ఉందని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.కలెక్టర్ స్పందిస్తూ నూతన భవన నిర్మాణంపై ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి త్వరగా మంజూరు చేయాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ యువనాయకులు పాల్గొన్నారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర కూడా హాస్టల్‌ను సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు.

## ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే




**తలకొండపల్లి, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్‌లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను గురువారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు.పాఠశాల భవనాలు, తరగతి గదులు, హాస్టళ్లు, సైన్స్--కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్స్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వ్యవస్థలను ఆయన సమీక్షించారు. నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు, పనుల వేగంపై ప్రత్యేక దృష్టి సారించారు."ఈ ప్రాజెక్టు కేవలం ఒక పాఠశాల నిర్మాణం కాదు, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర విద్యా యజ్ఞం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్ణీత గడువుకంటే ముందుగానే పనులు పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు.ఈ స్కూల్ భవిష్యత్తులో రాష్ట్రంలో ఆదర్శ విద్యా కేంద్రంగా నిలిచి, వేలాది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత అందరిది

- చైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ అన్నారు. ఈవెనింగ్ వాక్ లో భాగంగా గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్, ఆయా కాలనీ వాసులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులు పది కాలాలపాటు మన్నికగా ఉండే విధంగా నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారు. పర్యావరణ వ్యవస్థను వృక్షజాలాన్ని, జంతుజాలాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ కు నివారించాలన్నారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తగా మార్చి వేయాలని సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ఓ పాషా, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మహిళ గ్యాంగ్ రేప్..
# మర్మాంగంలో బుల్లెట్



**బెగుసరాయి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీహార్ లో గ్యాంగ్ రేప్ ఘటన జరిగింది. బెగుసురాయిలోని ఓ ఇంట్లోకి అయిదుగురు వ్యక్తులు ప్రవేశించి.. మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. భర్తను ఓ గదిలో కట్టిపడేసి, మహిళను బయటకు తీసుకెళ్లి గ్యాంగ్ రేప్ చేశారు. తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స సమయంలో డాక్టర్లు షాక్ అయ్యారు. బాధితురాలి మర్మాంగం నుంచి ఓ బుల్లెట్, రాయి, చెక్క ముక్కను తీశారు. అత్యంత క్రూర రీతిలో దుండగులు రేప్‌కు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు.చాకియా పోలీసు స్టేషన్ పరిధిలో జూన్ 11వ తేదీన ఈ ఘటన జరిగింది. రాత్రి 11.30 నిమిషాల సమయంలో టాయిలెట్ కోసం వెళ్లినప్పుడు అయిదుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడినట్లు బాధితురాలు చెప్పింది. భర్తను ఓ రూమ్‌లో తాళం వేసి, తన నోరు నొక్కి అత్యాచారానికి పాల్పడినట్లు ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొన్నది. చికిత్స కోసం తొలుత బరౌనీ ఆస్పత్రికి, ఆ తర్వాత సదర్ ఆస్పత్రికి వెళ్లినట్లు చెప్పింది.సదర్ ఆస్పత్రిలో చికిత్స సమయంలో తన మర్మాంగం నుంచి బుల్లెట్, రాయి, చెక్క ముక్కను తీసినట్లు ఆమె పేర్కొన్నది. గ్యాంగ్ రేప్ సమయంలో స్పృహ కోల్పోవడం వల్ల ఎలా తన ప్రైవేట్ భాగాల్లోకి ఆ వస్తువులు వచ్చాయో తెలియలేదన్నది. మూడు నెలల క్రితం కూడా ఓసారి ముగ్గురు వ్యక్తులు తమ ఇంట్లోకి చొరబడి గ్యాంగ్ రేప్‌కు ప్రయత్నించినట్లు ఆమె చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నది. ఈ షాకింగ్ కేసులో దర్యాప్తు చేపడుతున్నామని డీఎస్పీ ఆనంద్ కుమార్ పాండే తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకోనున్నట్లు పోలీసులు చెప్పారు.

## ధర్మస్థల వివాదంతో నాకు సంబంధం లేదు: ప్రకాశ్ రాజ్

**న్యూఢీల్లి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**



కర్నాటకలోని ధర్మస్థల వివాదంలో తన ప్రమేయం ఉందంటూ వస్తున్న ఆరోపణలను ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా ఖండించారు. ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేందుకు రూ. 200 కోట్లతో కుట్ర జరిగిందని, అందులో తనకూ పాత్ర ఉందని ముసుగు ధరించిన చిన్నయ్య అనే వ్యక్తి చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఈ వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని బుధవారం బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ఈ వివాదం గురించి తనకు ముందస్తు సమాచారం లేదని, తన పేరును కావాలనే ఇందులోకి లాగుతున్నారని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త గిరీశ్ మట్టన్నవర్ తనను సంప్రదించి, చిన్నయ్య అనే వ్యక్తి తనతో మాట్లాడాలని ఆశిస్తున్నట్లు తెలిపారని వెల్లడించారు. తమిళంలో మాట్లాడిన చిన్నయ్య తనను కలవాలని కోరగా, తాను నిరాకరించినట్లు చెప్పారు. అనంతరం అతను పంపిన వాయిస్ మెసేజ్‌ను సిట్ చీఫ్ ప్రణబ్ మొహంతికి పంపి, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించానని వివరించారు. ధర్మస్థల ఆలయ ప్రతిష్టను భంగపరచడానికి కేరళ నుంచి రూ. 200 కోట్లు అందాయని, ఈ కుట్రలో ప్రకాశ్ రాజ్ భాగస్వామిగా ఉన్నారని ఆరోపిస్తూ చిన్నయ్య కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై ప్రకాశ్ రాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తన పేరును వివాదాల్లోకి నెడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## రైతులకు కేంద్రం శుభవార్త..



**న్యూఢీల్లి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 23వ విడత నగదును జూన్ 20వ తేదీన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధాని ఈ నిధులను విడుదల చేయనున్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ ద్వారా ఈ ఆర్థిక సహాయం అందనుంది.

## వాహనాల ధరలు పెంచిన టాటా మోటార్స్

**న్యూఢీల్లి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**



జులై 1 నుంచి తమ వాణిజ్య వాహనాల ధరలను 2.5 శాతం పెంచుతున్నట్లు టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ ప్రకటించింది. పెరుగుతున్న వస్తువుల ధరలు, ఇన్‌పుట్ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయని పేర్కొంది. ఇదివరకే ప్రయాణికుల వాహనాల ధరలను 1.5 శాతం పెంచిన సంగతి తెలిసిందే.

# ఢిల్లీలో భారీ సైబర్ మోసం..

### మాజీ ప్రధాని కొడుకు ఖాతాల నుంచి కోట్ల రూపాయలు స్వాహా..!



**న్యూఢీల్లి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ రాజధాని ఢిల్లీ లో అత్యంత అధునాతన సాంకేతికతతో కూడిన ఒక భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. భారత మాజీ ప్రధాని ఇందర్ కుమార్ గుజ్రాల్ కుమారుడు, పార్లమెంట్ మాజీ సభ్యుడైన నరేష్ గుజ్రాల్ ఈ సైబర్ నేరగాళ్ల బారినపడ్డారు. టెక్స్‌టైల్స్, లెదర్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను నడుపుతున్న నరేష్ గుజ్రాల్ వాట్సాప్ ప్రొఫైల్ ఫోటోను దొంగిలించిన కేటుగాళ్లు.. ఆయన పేరుతో ఒక నకిలీ వాట్సాప్ ఖాతా ను సృష్టించారు. జూన్ 12 నుంచి 16వ తేదీల మధ్య కాలంలో సదరు నకిలీ ఖాతా ద్వారా గుజ్రాల్ కంపెనీకి చెందిన నమ్మకస్థుడైన ఉద్యోగిని సంప్రదించి, అత్యవసరంగా కొన్ని బ్యాంకు ఖాతాలకు కోట్ల రూపాయల నగదును బదిలీ చేయించారు.అవతలి వ్యక్తి తన యజమానేనని నమ్మిన ఆ ఉద్యోగి ఎలాంటి అనుమానం లేకుండా నాలుగు వేర్వేరు లావాదేవీల ద్వారా కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాల్లోకి బదిలీ చేశారు. జూన్ 16న ఈ నగదు బదిలీల సమాచారాన్ని సదరు ఉద్యోగి నరేష్ గుజ్రాల్ కుమార్తె దీక్షా గుజ్రాల్‌కు తెలియజేయడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఆమె వెంటనే తన తండ్రిని సంప్రదించగా.. తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని ఆయన స్పష్టంచేశారు. దాంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా తక్షణమే ఫిర్యాదు చేసి ఎలక్ట్రానిక్ ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఈ మోసంపై 78 ఏళ్ల నరేష్ గుజ్రాల్ స్పందిస్తూ.. ఢిల్లీ సైబర్ క్రైమ్ సంస్థలు, బ్యాంకులు అత్యంత వేగంగా స్పందించి మోసపోయిన మొత్తంలో దాదాపు 70 శాతం డబ్బును వివిధ ఖాతాల్లో స్తంభింపజేయగలిగారని చెప్పారు. ఇలాంటి మోసాలు జరిగినప్పుడు నష్టాన్ని తగ్గించుకోవడానికి ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చార్టర్డ్ అకౌంటెంట్ కూడా అయిన నరేష్ గుజ్రాల్ కంపెనీలోనే ఈ తరహా మోసం జరగడం కార్పొరేట్ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నకిలీ వాట్సాప్ దోపిడీకి పాల్పడిన సూత్రధారులను పట్టుకోవడానికి ఢిల్లీ పోలీసులు ముమ్మర దర్యాప్తు జరుపుతున్నారు.

# రష్యా సైనిక దళాల్లోకి 'బ్రహ్మోస్'..

### భారత్ నుంచి క్షిపణుల సరఫరాకు సన్నాహాలు!



**న్యూఢీల్లి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్‌ను రష్యా కొనుగోలు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా తన సైనిక దళాల్లోకి ఈ అత్యాధునిక క్షిపణి వ్యవస్థను ప్రవేశపెట్టాలని భావిస్తున్నది. బ్రహ్మోస్ క్షిపణిపై రష్యా ఆసక్తిని కనబరుస్తున్నదని బ్రహ్మోస్ ఏరోస్పేస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జైతీర్థ జోషి తెలిపారు. నాగపూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ సంస్థ 100వ స్వదేశీ బూస్టర్‌ను ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. బ్రహ్మోస్ ప్రోగ్రామ్‌లో రష్యా భాగస్వామ్యమే అయినా, ఈ క్షిపణిని తమ సైనిక దళాల్లోకి తీసుకెళ్లేందుకు ఆ దేశం ఆసక్తి ప్రదర్శిస్తుందని జోషి తెలిపారు.బ్రహ్మోస్ అంశంలో రష్యా సర్కారు ఆసక్తితో ఉందన్నారు. ఈ అంశంలో ఆ దేశంతో చర్చలు జరుగుతున్నాయని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని బ్రహ్మోస్‌ను రష్యా కోరుతున్నట్లు జోషి చెప్పారు. భవిష్యత్తులో రష్యాకు అవసరమయ్యే క్షిపణులను ఇండియా నుంచి పంపిస్తారా అని అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. రష్యా తయారీ సంస్థలకు భారతీయ పరిశ్రమలు ఊతం అందిస్తాయన్నారు. రష్యా వద్ద సౌకర్యాలు ఉన్నాయని, కానీ అవి సరిపోకపోవచ్చు అని, ఈ అంశంలో రష్యాతో లోతుగా స్టడీ చేసి, అవసరమైన క్షిపణులను పంపనున్నట్లు జోషి తెలిపారు. భారత్‌కు చెందిన డీఆర్డీవో, రష్యాకు చెందిన ఎన్‌పీవో మషినోస్ట్రోయేనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని డెవలప్ చేస్తున్నాయి. భారత రక్షణ రంగంలో ఇప్పుడు బ్రహ్మోస్ ఓ కీలక ఎగుమతి వస్తువుగా మారింది. బ్రహ్మోస్ క్షిపణికి ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు వచ్చిందని, సుమారు 25 ఏళ్ల పాటు సాగిన డెవలప్మెంట్, టెస్టింగ్, ఆపరేషనల్ డెవలప్మెంట్ ఫలితమే బ్రహ్మోస్ అని జోషి పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో బ్రహ్మోస్‌ను సమర్థవంతంగా వినియోగించినట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్ వేళ లైవ్ టెస్ట్ చేశామని, ఆ సక్సెస్ స్టోరీ ప్రపంచం అంతా చూసిందన్నారు. బ్రహ్మోస్ క్షిపణులను ఖరీదు చేసేందుకు వియత్నాం కూడా ఆసక్తిగా ఉన్నది. అయితే ఆ డీల్‌కు చెందిన చివరి దశ క్లియరెన్స్‌లు కావాల్సి ఉందని జోషి అన్నారు. కొన్ని తూర్పు, పశ్చిమ దేశాలు కూడా బ్రహ్మోస్‌ను ఖరీదు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఆయన చెప్పారు.

# స్మార్ట్‌ఫోన్లపై తాలిబన్ల నిషేధం..

### ప్రభుత్వ అధికారులు వాడితే కఠిన చర్యలు.. వందల ఫోన్లు ధ్వంసం



**న్యూఢీల్లి జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల పాలన నడుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రభుత్వానికి సంబంధించి తాలిబన్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలో ప్రభుత్వ అధికారులు స్మార్ట్‌ఫోన్లు వాడకుండా నిషేధం విధించారు. అంతేకాదు.. అధికారులు స్మార్ట్‌ఫోన్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, వారివద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్లను తీసుకుని, అన్నింటినీ కలిపి బహిరంగంగా ధ్వంసం చేశారు. ఈ అంశంపై తాలిబన్ మిలిటరీ కోర్టులు అధికారులకు ఆదేశాలు జారీ చేశాయి.ఉన్నతాధికారుల నుంచి జనరల్ స్టాఫ్ వరకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. వీరెవరూ స్మార్ట్‌ఫోన్లు వాడటానికి వీల్లేదు. సుప్రీం లీడర్‌కు మాత్రమే ఫోన్ వాడేందుకు అనుమతించారు. ఈ ఆదేశాలు అధికారికంగా వెలువడటం మాత్రమే కొత్త. కానీ, కొంతకాలంగా ఈ ఫోన్ల వాడకంపై అనేక ఆంక్షల్ని తాలిబన్లు అనధికారికంగా అమలు చేస్తున్నారు. తాజా ఆదేశాల ప్రకారం ఎవరైనా అధికారి ఫోన్ వాడుతూ పట్టుబడితే ఆ ఫోన్‌ను వెంటనే ధ్వంసం చేస్తారు. అలాగే, కోర్టు నియమాలకు అనుగుణంగా, షరియా చట్టాలకు అనుగుణంగా శిక్షలు విధిస్తారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే అధికారుల వద్ద ఉన్న ఫోన్లను తాలిబన్లు స్వాధీనం చేసుకున్నారు. వందలాది ఫోన్లను ఒకేచోట చేర్చి ధ్వంసం చేశారు. ఫోన్లు వాడటం వల్ల కొన్ని కీలక డాక్యుమెంట్లు లీక్ కావడం, ఉత్పత్తి తగ్గిపోవడం, పనులు మందగించడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు ఫోన్లు వాడటం వల్ల సున్నితమైన సమాచారం లీకవుతోందని తాలిబన్లు గుర్తించారు. కొందరు అధికారులు ఫోన్లు వాడుతూ పని చేయడం లేదు. అలాగే, మీటింగ్ జరిగేటప్పుడు కూడా ఫోన్లకే అతుక్కుపోతున్నారు. కొన్ని అంశాలపై నిర్ణయం తీసుకున్నప్పుడు సుప్రీం లీడర్ సంతకం చేయకముందే దానికి సంబంధించిన వివరాలు ప్రజలకు చేరిపోతున్నాయి. ఇలాంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేసిన తాలిబన్లు తాజాగా అధికారికంగా ఫోన్లను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నీలా మధు గుప్తా ఏకగ్రీవ ఎన్నిక

**ఎల్బీనగర్, జూన్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికల ఏర్పాట్లు నిర్వహించడం జరిగింది. బి.ఎన్. రెడ్డి కళ్యాణ మండపంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ పర్వం కొనసాగగా, అధ్యక్ష పదవికి నీలా మధు గుప్తా ఒక్కటే నామినేషన్ దాఖలైంది. దీంతో నీలా మధు గుప్తా సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ చీఫ్ కోఆర్డినేటర్ చింతల రవికుమార్ గుప్తా , రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బిలకంటి కిరణ్ గుప్తా , రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం , అలాగే సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం తాజా మాజీ అధ్యక్షులు పద్మారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన అధ్యక్షులు శ్రీ నీలా మధు గుప్తా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే సంఘ బలోపేతానికి, ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సభ్యులు మరియు ప్రముఖులు నీలా మధు గుప్తా ఘనంగా అభినందించి, వారి పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



# బిజినెస్

## వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభపడ్డ స్టాక్ మార్కెట్లు..

### సెన్సెక్స్ 254 పాయింట్లు లాభం



భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. వరుసగా ఐదో సెషన్‌లోనూ స్టాక్ మార్కెట్లు లాభాలు పొందడం విశేషం. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు (0.33 శాతం) లాభపడి 77,409.98 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో 77.492.33 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 82.30 పాయింట్లు (0.34 శాతం) లాభపడి 24,168 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 0.33 శాతం, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 0.43 శాతం లాభపడ్డాయి.గత ఐదు సెషన్లలో స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే ముగిశాయి. ఐదు సెషన్లలో బీఎస్ఈ సెన్సెక్స్ 4.8 శాతం, నిఫ్టీ 4.3 శాతం లాభాలు పొందాయి. రూపాయి విలువ బలపడి 16 పైసలు పెరిగింది. డాలర్‌తో 94.32 వద్ద రూపాయి కొనసాగింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 2.1 శాతం తగ్గి 77.8 డాలర్ల వద్ద కొనసాగింది. డబ్ల్యూటీఐ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76 డాలర్ల దిగువకు చేరింది. గురువారం బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఎస్బీఐ 1.64 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.419 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.67 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.39 శాతం లాభపడ్డాయి. అయితే, ఐటీ స్టాక్స్ ఒత్తిడిని ఎదుర్కొని నష్టాల బాటలో నడిచాయి. ఇన్ఫోసిస్ షేర్లు అత్యధికంగా 2.66 శాతం నష్టపోగా, టెక్ మహీంద్రా షేర్లు 1.07 శాతం, టీసీఎస్ షేర్లు 0.82 శాతం, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 0.41 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ షేర్లలో అత్యధికంగా ఇండిగో సంస్థ ఈ రోజు భారీ లాభాలు పొందింది. ఇండిగో మాతృ సంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ సంస్థ 2.73 శాతం లాభపడగా, ట్రెంట్ సంస్థ షేర్లు 2.52 శాతం లాభపడ్డాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, శుక్రవారం నుంచి హోర్ముజ్ జలసంధి పూర్తిగా తెరుచుకోనుండటం వంటివి మార్కెట్లు లాభాలబాటలో నడిచేందుకు కారణమయ్యాయి.

### జులై నుంచి కియా

## కార్ల ధరలు పెంపు



డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ముడిసరకుల ధరలు పెరగడంతో ఆటోమొబైల్ కంపెనీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో, కియా ఇండియా తన కార్ల ధరలను జులై నుంచి 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ముడిసరకుల ఖర్చు, నిర్వహణ వ్యయం పెరగడమే దీనికి కారణమని కంపెనీ పేర్కొంది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్, EV సెగ్మెంట్‌లోని మోడళ్లను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది.

## మళ్లీ తగ్గుతున్న బంగారం, వెండి ధరలు.. తులం ఎంతంటే?



బంగారం కొనే వారికి ఇదొక గుడ్‌న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే గత కొన్నాళ్లుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. బుధవారంతో పోల్చుకుంటే గురువారం ఉదయం 6గంటల వరకు బంగారం ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 151,090 వద్ద కొనసాగుతుండగా బుధవారం ఈ ధర రూ.1,51,360గా ఉంది. అంటే బుధవారం పోల్చుకుంటే గురువారరి రూ.300 వరకు దిగొచ్చింది. ఇక 22 క్యారట్ల బంగారం ధర చూసుకుంటే దీనిపై కూడా రూ.200పైగా తగ్గి ప్రస్తుతం 10 గ్రాముల ధర రూ.1,38,490 వద్ద స్థిరపడింది. ఇక వెండి కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.2,64,900 వద్ద కొనసాగుతుంది.

ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,090. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,38,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,74,900గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,51,090. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,38,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,74,900 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,51,090. 22 క్యారెట్ల ధర రూ.1,38,490 ఉంది. వెండి కిలో ధర రూ.2,64,900 లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,51,090, 22 క్యారెట్ల ధర రూ.1,38,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,64,900 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,51,240. 22 క్యారెట్ల ధర రూ.1,36,640 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,64,900 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.153,050, 22 క్యారెట్ల ధర రూ.1,40,290 ఉంది. వెండి కిలో ధర రూ.2,74,900 ఉంది.

# స్పోర్ట్స్

## భారత హాకీ స్టార్ మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు..

### -దిలీప్ టిర్కీ రికార్డు బ్రేక్



భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు.ఈ చారిత్రక ఘనతను గుర్తిస్తూ హాకీ ఇండియా.. మన్‌ప్రీత్ సింగ్‌ను అభినందించి, రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. పదిహేనేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నాడని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19 ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్, టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ ఐదో స్థానంలో నిలువడం విశేషం. ఈ మైలురాయిపై మన్‌ప్రీత్ సింగ్ స్పందిస్తూ.. 'భారత్ తరఫున ఇన్ని మ్యాచ్‌లు ఆడటం గర్వంగా ఉంది. ఈ విజయాన్ని నా సహచరులకు, కుటుంబసభ్యులకు అంకితం చేస్తున్నా' అన్నాడు. ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలువాలనేదే తన లక్ష్యమని ఆయన స్పష్టంచేశాడు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ మాట్లాడుతూ.. 'మన్‌ప్రీత్ అంకితభావం, నిలకడకు ఈ రికార్డు నిదర్శనం. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తి' అని ప్రశంసించారు. హాకీ ఇండియా సెక్రెటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మన్‌ప్రీత్‌ను ప్రశంసించారు.

## లార్డ్స్‌లో టీమిండియాతో టెస్టు.. పకడ్బందీగా ఇంగ్లండ్ స్క్వాడ్..!




మహిళల పొట్టి ప్రపంచకప్ ముగియడమే ఆలస్యం ఇంగ్లండ్, భారత జట్ల మధ్య టెస్టు పోరు మొదలవ్వనుంది. మూడు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌లో భారత జట్టును చిత్తు చేసిన ఆతిథ్య జట్టు.. ఈసారి లార్డ్స్ (గ్రాశీతీసం) మైదానంలో బిగ్ ఫైట్‌కు సిద్ధమవుతోంది. ఇరుజట్ల మధ్య తొలి టెస్టు కోసం గురువారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించింది.స్వదేశంలో పొట్టి సిరీస్‌లో భారత మహిళల జట్టును 2-0తో ఓడించిన ఇంగ్లండ్ లార్డ్స్ టెస్టులో పకడ్బందీగా బరిలోకి దిగనుంది. ఈ మైదానంలో ఇరుజట్లు తొలిసారి ఎర్ర బంతితో తలపడనున్నాయి. దాంతో, నాట్ సీవర్ బ్రంట్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఇంగ్లండ్ వేల్స్ బోర్డు ప్రకటించింది.జూలై 10 నుంచి జరిగే ఈ మ్యాచ్‌తో ఆల్‌రౌండర్ అలీసే క్యాప్సే, టిల్లీ కార్టీన్ -- కొలేమన్, మాడీ విల్లెర్స్‌లు టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నారు. అలానే స్క్వాడ్‌లోని గ్రేస్ పాట్స్, ఎల్లీ త్రెల్‌కెల్డ్‌లు అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ ఆడనున్నారు.

**ఇంగ్లండ్ టెస్ట్ స్క్వాడ్ :**

నాట్ సీవర్ బ్రంట్(కెప్టెన్), టమ్మీ బ్యూమంట్, లారెన్ బెల్, మలా బౌచర్, అలీసే క్యాప్సే, టిల్లి కార్టీన్ కొలెమన్, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ ఫైలర్, అమీ జోన్స్(వికెట్ కీపర్), హీథర్‌నైట్, ఎమ్మా లాంబ్, గ్రేస్ పాట్స్, ఎల్లె త్రెల్‌కీడ్, మాడీ విల్లెర్స్, ఇస్సీ వాంగ్.

### ఆసియా క్రీడలకు దూరమైన

## టేబుల్ టెన్నిస్ స్టార్..!



ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల ఆరంభానికి ముందే భారత్‌కు బిగ్ షాక్. పలు పోటీల్లో పతకాలు గెలిచిన టెన్నిస్ క్రీడాకారిణి మనికా బత్రా అనూహ్యంగా 20వ ఆసియా క్రీడలకు దూరమైంది. మహిళల విభాగంలో ఫేవరెట్టైన మనికా నిర్దేశించిన అర్హత ప్రమాణాలను అందుకోలేదు. దాంతో, భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఆమెను స్క్వాడ్ నుంచి తప్పించింది.ఆసియా క్రీడల్లో పతకం కొల్లగొట్టాలనుకున్న మనికా బత్రా ఆశలు ఆవిరయ్యాయి. ఇటీవల కాలంలో దేశవాళీ పోటీలకు డుమ్మా కొట్టడంతో ఫలితంగా ఆమెకు టీటీఎఫ్ఐ ర్యాంకింగ్స్ రాలేదు. కాబట్టి.. ఆసియా క్రీడల స్క్వాడ్ నుంచి మనికను తప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ టోర్నీలో స్వస్తికా ఘోష్‌తో పాటు రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది మనికా. కానీ, ఇప్పుడు అనూహ్యంగా ఆమె టోర్నీకి దూరమైంది. మనిక గైర్హాజరీలో భారత బృందానికి శ్రీజ నాయకత్వం వహించనుంది. జపాన్ వేదికగా 20వ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకూ జరుగనున్నాయి.

## ఐపీఎల్‌కు ఎండావాన సెగ..

### 2027 ఎడిషన్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం..!




వేసవిలో క్రీడా వినోదం పంచే ఇండియన్ ప్రీమియర్ లీగ్ విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయానికి సిద్ధమవుతోంది. ప్రతి సీజన్‌ను మార్చి నెలాఖరులో ప్రారంభించే బీసీసీఐ.. 2027 ఎడిషన్ విషయంలో ముందు చూపుతో వ్యవహరించాలనుకుంటోంది. సీజన్ మధ్యలో మండు టెండలు, అకాల వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఐపీఎల్ 2027ను కాస్త ముందుగానే జరపాలని భావిస్తోంది. ఈ విషయమై ఐపీఎల్ వచ్చే సీజన్ షెడ్యూల్‌పై గురువారం బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా హింట్ ఇచ్చేశాడు.ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027ను ముందుగానే మొదలెట్టాని బీసీసీఐ భావిస్తోంది. సెక్రటరీ దేవజిత్ సైకియా ఇదే అంశంపై మాట్లాడుతూ.. 'ఈ ఏడాది ఐపీఎల్ మార్చి 29(28) వ తేదీన ప్రారంభమైంది. అయితే.. మే రెండో వారం టోర్నీ సమయంలో వర్షాలు పడుతున్నాయి. ముందుస్తు వానల కారణంగా టోర్నీకి అంతరాయం కలుగుతోంది.అలానే ఎండ తీవ్రతకు ఆటగాళు, అభిమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ, ఐపీఎల్ కార్యనిర్వాహణ మండలి కీలక ఆలోచన చేస్తోంది. ఐపీఎల్ 2027ను మార్చి నెలాఖరున కాకుండా ముందుగానే జరపాలని భావిస్తున్నాం. మార్చి 10 నుంచి మార్చి 15 మధ్య సీజన్‌ను ఆరంభించే అవకాశముంది' అని దేవజిత్ సైకియా వెల్లడించాడు. అంతేకాదు షెడ్యూల్ ముందుకు జరిపాలని అభిమానుల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. దాంతో, మే 15 కల్లా టోర్నీని ముగించాలని భావిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి పేర్కొన్నాడు. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఐపీఎల్ 19వ సీజన్ కాస్త ఆలస్యమైన విషయం తెలిసిందే.